

గడియారం నాలుగు గంటలు కొట్టింది.

అంటే అయిదయింది అన్నమాట. అదెప్పుడూ ఒకగంట తక్కువ కొట్టుతుంది. దాన్ని రిపేరు చేయించాలని చాలాకాలంనుంచి అనుకుంటాడు. సరిగ్గా రాత్రి పడుకునేటప్పుడు గుర్తుకువస్తుంది. ఇందులో గోపాలం తప్పేమీ లేదు. సరస్వతితో గుర్తుచేయమని చెప్పాడు. రాత్రి పదకొండు గంటలకు పూర్తిగా దుప్పటి ముసుగు కప్పుకుని నిద్ర పోదామనుకుంటే గడియారం పది గంటలు కొడుతుంది. గోపాలానికి విసుగు వస్తుంది.

'దాని మాట జ్ఞాపకం చెయ్యమంటే చేశావూ...' అని అడుగుతాడు.

'దేనిమాటండీ...' సరస్వతి ఎదురు ప్రశ్న వేస్తుంది.

'నిన్నడగటం బుద్ధితక్కువ నాది...' అనుకుని గోపాలం కళ్ళుమూసుకుంటాడు.

ఏదో పుస్తకంలో గారెలు వండటం గురించి వ్రాసి 'పప్పు పదిహేను నిముషములు రుబ్బవలెను...' అని ఉంది. వంట కొత్తగా నేర్చుకున్న సరస్వతి గడియారంముందు కూర్చుంది. పప్పు నానబోయాలని గోపాలంతల్లి కమలమ్మ వచ్చి చెప్పింది.

'నాకు తెలుసు...' అందామనుకుంది సరస్వతి. సరస్వతికి కమలమ్మఅంటే లోపల కోపం. తనతో పెళ్ళికి అంత ఇష్టం చూపలేదని ఎవరో చెప్పారు. అప్పటినుంచి కమలమ్మ పలకరిస్తే అదోలా సమాధానం చెపుతుంది.

ఇసుకపల్లి దక్షిణామూర్తి

కమలమ్మ పగలూ, రాత్రీ 'కోడలు.. కోడలు' అంటూ కలవరించింది. అయితే ఎటువంటి కోడలు కావాలన్నది ఇదమిద్ధమని తేల్చుకోలేదు. వడ్లు దంపటానికి వచ్చినవాళ్లు 'అత్తలేని కోడలుత్తము రాలూ...' అంటూ పాడటం విన్నప్పటి నుంచి కోడలు మంచిది కావాలనుకుంటే వేరేమార్గం లేదా?' అని ఆలోచనలో పడింది.

కమలమ్మ మొగుడు మార్కండేయులు. చండామార్కుడు ఒక రకంగా. కొంతమంది రావణాసురుడు లాంటి వాడనిగూడా అంటారు హిరణ్య కశిపుడుతో పోల్చవచ్చు అనిగూడా కొందరు అంటారు జ్యోతిశ్శాస్త్రంలో దిట్ట. గ్రహాలన్నిటినీ తనకు కావలసిన స్థానాల్లో నుంచోపెట్టాడుట ప్రహ్లాదుడు పుట్టేముందు. తనకుగూడా అటువంటి కోర్కె ఉన్నా, ఇంట్లోవాళ్ళే గ్రహాలై తను చెప్పినమాట వినకపోతే ఏం చేస్తాడు కర్మ అని ఊరుకున్నాడు. ఒక్కోసారి విరుచుకుపడతాడు. కమలమ్మ పురుడుపోసుకున్నప్పుడు, జాతకచక్రంవేసి, మీనమేషాలు లెక్క పెట్టి, ఒక్కగంటఆగి మగ పిల్లవాడిని కంటే బ్రహ్మాండంగా ఉంటుందని అంచనా వేశాడు. కమలమ్మ ఎప్పుడూ తనమాట వినేదే! మొదటిసారి 'ఆడపిల్ల కావాలని' కూర్చుంది. 'వీల్లేదు...' అన్నాడు. ఏదో సినిమాలో చెప్పినట్లు ఆఖరి నిర్ణయం కమలమ్మలోనే ఉంది. కనీసం పైమయినా తను చెప్పినట్లు వింటుందేమో అనుకున్నాడు. గడియారంవంక చూస్తూ 'ఒక్కగంట ఆగండి. మంచి నక్షత్రం వస్తుంది...' అని చెబుదామని, గది గుమ్మందగ్గరకు వెళ్ళేటప్పటికి 'క్యారు...క్యారు' మని ఏడుపు వినిపించింది. అప్పటినుంచి ఆయనకు గడియారం అంటే కోపం. ఆడపిల్ల అయితే ఇంట్లోనుంచి లేచిపోదామనుకున్నాడు ఆ క్షణంలో. మొగపిల్లాడని తెలిసి శాంతించాడు

వాడి జాతకం లెక్కవేశాడు. వట్టి మెతక మనిషి తెలివితక్కువ వాడుగా తయారు కావాలి తన పోలికలు రానందుకు మండిపడ్డాడు

ఆ గోపాలం పెరిగి పెద్దవాడయి ఒక ఇంటివాడు కాబోయేటప్పటికి అన్ని సమస్యలూ ఎదురయ్యాయి.

మార్కండేయులు సంబంధాలు చూసి చూసి వీడి జాతకానికి, రాబోయే పిల్ల జాతకానికి పోల్చి పండితులతో చర్చించాడు. ఒకళ్ళు బాగుందన్నారు. మరొకళ్ళు బాగాలేదన్నారు. తనకు మాత్రం రెండభిప్రాయాలూ ఉన్నాయి. నిర్ణయానికి రాలేక పోయాడు గోపాలం తెలివిగలవాడయితే ఏ బాధా ఉండేదికాదు. కరుకు మనిషి, వీడి జాతకానికి సరిపడని పిల్ల వస్తే ఏం ఇబ్బందులు పడతాడో అని భయం.

గోపాలాన్ని చిన్నప్పటినుంచీ జాగ్రత్తగా పెంచారు. ఎదురింటి పిల్లలు గోపాలాన్ని కొట్టేవాళ్లు. వాళ్లని తిట్టి పోశారు. 'వాళ్ల మంచివాళ్ళు కారు... తగాదాకు పోవద్దు' అని నూరిపోశారు. వాళ్ళని ఎదురుతిరిగి కొట్టగూడదు కాబోలు అనుకున్నాడు గోపాలం. వాళ్లు కొడుతుంటే ఏడుస్తూ ఇంటికి వచ్చేవాడు. 'తెలివి తక్కువ సన్యాసి' అని గోపాలాన్ని కౌగలించుకుని ఓదార్చింది కమలమ్మ. గోపాలం మామయ్య కాబోలు ఒకనాడు పండగకని వచ్చి వీళ్ళ దెబ్బలాట చూసి 'కొడుతుంటే చూస్తూ ఊరుకుంటా వేమిరా..తిరిగి రెండువెయ్యక'అన్నాడు. అప్పుడు గోపాలం తనమీద కలియబడ్డ వాళ్లిద్దరినీ చితకతన్ని వచ్చాడు. వాళ్ల పెద్దవాళ్ళు నేరం చెప్పటానికి వస్తే 'మా అబ్బాయి అట్లా కొట్టేవాడు కాదు...పిచ్చి సన్యాసి.' అని చెప్పి పంపారు.

అలాంటి గోపాలం పెరిగి పెద్ద వాడయ్యాడు. ఎటువంటి దుస్సహవాసం లేకుండా అల్లారుముద్దుగా, వగైరాగా పెరిగాడు.

'పెళ్ళి సంబంధం మాట్లాడేటప్పుడు జాతకాలు చూడాలి' అన్నాడు మార్కండేయులు.

'పిల్లను చూడకమునుపు జాతకాలు చూడటం అనవసరం. నేను పోయి చూసి వస్తాను...' అంది కమలమ్మ.

'వీల్లేదు...' అన్నాడు మార్కండేయులు.

'ఎందుకు వీల్లేదో చూస్తాను...' అంది కమలమ్మ. మార్కండేయులు ఉగ్రరూపంతాల్చి 'విరుచుకు తింటాం' పోజుపెట్టి వెళ్ళిపోయాడు. 'ఈ కోపం సంగతి నాకు తెలియదా...తాటాకుల మంట ..నీటిమీద గీత...గాలిలోమాట... ఉపమానాలు ఎన్నయినా చెప్పుకోవచ్చు.' అనుకుంది.


గోపాలం గదిలో కూర్చున్నాడు. అతను పిల్లను చూడాలని ఎవరూ అనుకోలేదు పుస్తకం పట్టుకుని అక్షరాలమీద కళ్ళుపెట్టి దాని వెనక అర్థం కోసం వెతుకుతున్నాడు.

గోపాలం నిద్రపోతుంటే కమలమ్మ పక్కనే పడుకుంది. మార్కండేయులు మడతమంచంమీద పడుకుని దోమలుతోలుకుంటున్నాడు. నల్లుల్ని పడుతున్నాడు.

'మీకు జాతకాలు నచ్చేవరకు ఆగితే అబ్బాయి పెళ్ళి కాదు...' అంది కమలమ్మ.

'మళ్ళా మొదలుపెట్టావు సోది... పడుకో...పడుకో...' అన్నాడు,

'పడుకో! పడుకో!! ఇదో మాట నేర్చారు...కాపురానికి వచ్చినప్పటినుంచి చూస్తున్నాగా...ఒక్కరోజు అయినా నా నోటివెంట నాలుగు మాటలు రానిచ్చారా...' అంది కమలమ్మ.



'నీవంటి గయ్యాళినే తెచ్చి వాడికి కట్టమంటావా...'

'మీ కొడుకేగా...'

'వాడికి నా పోలికలు వస్తే బాగానే ఉండేది...మెతక సన్యాసి...'

గోపాలానికి మెలకువ రావటం, 'సన్యాసి' అన్నమాటలు వినబడటం జరిగింది. ఇంకా ఏమేం మాటలు దొర్లుతాయో అని మళ్ళీ బలవంతాన నిద్రపోయాడు.

'ఎప్పుడూ ఇంట్లో పెట్టుకుంటే వాడి మెతకతనం పోతుందా...పదిచోట్లకు తీసుకెళ్లాలి...నాలుగు ఊళ్లు చూపించాలి.. అంతా పుట్టంగానే తెలివిగలవాళ్లయారా.' అంది కమలమ్మ.

'బజారుకు పంపిస్తే ఒక్కపని చేసుకు రాలేడు...మొన్న వెంకట్రామయ్య ఇంటికి వెళ్ళి నిర్వాకం చేసుకొచ్చింది చాలదూ...' అన్నాడు మార్కండేయులు.

'వెంకట్రామయ్య ఇంటికిపోయి పైకం తీసుకుని రారా...' అని పంపిస్తే అక్కడకుపోయి కబుర్లుచెబుతూ కూర్చున్నాడు. ఎంతకీ తిరిగిరాడు. వాళ్ళింట్లోనే భోజనంచేసి సాయంత్రానికి తిరిగి వచ్చాడు.

'ఏమిటిరా...'అంటే'భోజనం చెయ్యమన్నారు......బావుండదని ఉండిపోయాను...' అన్నాడు. అంతటితో ఊరుకున్నా కొంతవరకు సరిపోయేది.



'వాళ్ళమ్మాయి సరస్వతి చీట్లపేక ఆడటం నేర్పింది...ఎవరూ చెప్పకుండా 'అడ్డాట' ఆడటం చేతయింది......' అన్నాడు. మార్కండేయులు మండిపడ్డాడు. 'ఆడదాని దగ్గర నేర్చుకోవటమా...' అన్నాడు.

'మీకు చేతయితే నేర్పక పోయారూ...' అంది కమలమ్మ. చీట్లాట నేర్చుకోనందుకు చింతించినా 'ఆ ముదనష్టపు ఆట ఆడాలి...ఇంతబతుకు బతికి.....' అన్నాడు.

కమలమ్మ ఒకక్షణం ఆగి 'నిద్ర పోయారా...' అంది. మార్కండేయులు కొంచెం కదులుతూ......'ఎందుకు...' అన్నాడు. కమలమ్మ ఉస్సూరుమంది. 'ఎందుకా?...పడుకోండి...పడుకోండి... నా కర్మకు నే నేడవాలిగాని...మిమ్మల్ని అని ఉపయోగం ఏమిటి...' అని వినబడీ వినబడకుండా సణిగింది.

'అదేదో...బిగ్గరగా అఘోరిస్తే సరిపోతుంది...' అని సమాధానం కోసం ఆగకుండా గుర్రుపెట్టాడు. ఆ గుర్రు వింటూ 'ఒక మగపిల్లవాడయ్యాడు... ఒక్క ఆడపిల్లగూడా ఉంటే ఎంత బాగుండేది...' అనుకుంటూ పడుకుంది కమలమ్మ.

కమలమ్మపోరు పడలేక మార్కండేయులు గోపాలాన్ని ఒక సంబంధం చూడటానికి తీసుకుపోయాడు. అమ్మాయి వచ్చింది. చాపమీద కూర్చుంది. వంచిన తల ఎత్తలేదు. పిల్లతల్లి వచ్చి 'కొంచెం తల ఎత్తమ్మా...' అంటే 'ఎందుకులెండి...' అన్నాడు మార్కండేయులు.

గోపాలం పిల్లతల్లిని పరీక్షగా చూసి 'ఇట్లాగే ఉంటుంది కాబోలు...' అనుకుని వచ్చాడు.

పాట పాడమన్నారు.

'ఎందుకు,కచేరీలు చేయబోతోందా...' అన్నారు. కమలమ్మ ఏమీ అనలేక ఊరుకుంది.

'సరే జాతకం చూపండి..' అన్నాడు.

కాగితాలు సిరాగీతలతో నింపారు గ్రహాలు కదిలినాయి. పాత పంచాంగాల పాతపేజీలు అప్పడం ముక్కల్లాగా విరిగిపోతూ వచ్చినాయి. ఏమీ తేలలేదు.

గోపాలం పెళ్ళి వాయిదా పడింది.

గోపాలానికని చూసిన పిల్లల పెళ్లిల్లు గబగబా అయిపోతున్నాయి కొంతమందికి మగపిల్లలు, కొందరికి ఆడపిల్లలు.

గోపాలం కూరగాయల మార్కెట్టుకు వెళ్లితే ఒకమ్మాయి చంటిపిల్లను చంకన వేసుకుని, చేత్తో రెండేళ్ళ పిల్లాడిని నడిపించుకుంటూ వచ్చింది. 'ఎక్కడో చూసినట్లుందే' అనుకున్నాడు. ఆ అమ్మాయి అతని దగ్గరకు వచ్చి తేరిపారచూసి 'మీ నాన్నగారి పేరు మార్కండేయులు గారు కదూ...' అంది

గోపాలం 'అవునవును...'అన్నాడు అంతటితో ఊరుకోక 'సరిగ్గా గుర్తుపట్టలేదు...' అన్నాడు.

'నేను.....కోటేశ్వరరావుగారమ్మాయిని...మీరు నన్ను చూడటానికి గుంటూరు రాలా...?' అంది.

గోపాలం పని బిక్కచచ్చినట్లయింది. ఎవరన్నా చూస్తున్నారేమోనని అటూ ఇటూ చూశాడు.

"మా అబ్బాయి ... అమ్మాయి...' ఇద్దరినీ చూపించింది. గోపాలానికి గూడా ఏదన్నా మాట్లాడాలని అనిపించింది.

'పేరేమిటి...' అన్నాడు చంటి పిల్లను చూపిస్తూ.

'నా పేరు కళ్యాణి...అబ్బాయి పేరేమో రాముడు, అమ్మాయి పేరేమో సునీత...ఇంటిదగ్గర వెంకటేశ్వర్రా వున్నాడు...' అంది

'బాగున్నాయి పేర్లు...అయితే సునీత ఆఖరమ్మాయి అన్నమాట...' అన్నాడు.

'అదే'.... మూడోది....ఆఖరమ్మాయని అప్పుడే ఏంచెపుతాం...' అంది. గోపాలం నిశ్చేష్టుడయ్యాడు. వయసు సొగసు అతణ్ణి తలక్రిందులు చేసింది... ఆ అమ్మాయి కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి

'అయితే మీకు పెళ్లయిందా'...అంది ఆ అమ్మాయి ఆఖరికి. గోపాలాన్ని ఎవరో కర్రపెట్టి కొట్టినట్లయింది.

'ఇంకా చేసుకోలేదు...' అన్నాడు.

'మీ నాన్నగారికి జాతకాలు నచ్చొద్దూ. నా జాతకం చూసి సంతానం కలగదని చెప్పారుట !! తొందరగా పెళ్ళి చేసుకోండి...' అంది. ఆ అమ్మాయి

స్వచ్ఛంగా నవ్వుతుంటే గోపాలం నమ్మలేకపోతున్నాడు. ఆ అమ్మాయిని చూడటానికి వెళ్ళినప్పుడు తనకు బాగానే నచ్చింది. తండ్రితో చెప్పలేకపోయాడు. 'ఎంత పొరపాటుపని చేశాను...' అనుకున్నాడు. అప్పుడు ఒద్దికగా కూర్చుంది. ఎవరెంత పలకరించినా పేరయినా చెప్పలేదు. 'ఆడవాళ్ళు ఎంత తొందరగా పెరిగిపోతారు...' అనుకున్నాడు

'వస్తానండి...మా ఆయనగారికి ఇక్కడే ఉద్యోగం...ఎప్పుడైనా రండి. మీ నాన్నగారికి అమ్మగారికి నమస్కారాలు చెప్పండి...వస్తా...' అని పిల్ల ఏడుస్తుంటే 'ఊరుకో అమ్మా..ఊరుకో' అంటూ పసిపిల్ల తలమీదకు గుడ్డ సర్ది మెల్లిగా నడిచిపోయింది.

గోపాలం తెల్లగుడ్లు వేసుకుని ఇంటికి వచ్చాడు.

'కూరలు తేలేదేమిరా...' అని అడిగింది తల్లి.

'పరధ్యానం సన్నాసి...ఏదన్నా పెద్ద సపోటా ఇస్తావుగా వాడికి...సపోటా... ఇవీ మన వాడి తెలివితేటలు ...' అన్నాడు తండ్రి.

గోపాలం వాళ్ళిద్దరి వంకా చూసి 'మీ కొడుక్కి ఇంత కంటె తెలివితేటలు ఎక్కడ నుంచి వస్తాయి' అన్నాడు.

వాళ్ళిద్దరికీ ఎలెక్ట్రిక్‌షాక్ తగిలినట్లయింది. కళ్ళు నులుముకున్నారు. వాళ్ల గోపాలమేనా ఇట్లా మాట్లాడేది! నమ్మలేకపోయాడు.

'ఏమిటిరా నువ్వంది...మళ్లీ అను... మళ్లీ అను...' అన్నాడు.

'మీకు తెలియదూ...మళ్లీ ....మళ్లీ అనటానికి...'అని సమాధానం చెప్పాడు గోపాలం.

వాళ్లిద్దరూ ఈ షాక్ నుంచి తట్టుకోవటానికి వారం రోజులు పట్టింది.

మళ్ళీ సంబంధాల అన్వేషణ మొదలయింది.

'జాతకాలు చూడక్కరలేదు...' అన్నాడు గోపాలం.

'అందం కొరుక్కుతింటామా...' అని గూడా అన్నాడు.

'ఇదెక్కడి విలయం వచ్చి పడిందిరా...' అనుకున్నాడు.

గోపాలం ఉండి ఉండి చొక్కాలాగూ లోపలికేసుకుని ఇంటికి వచ్చాడు.

ఒకరోజు అన్నం తిని మార్కండేయులు చేయికడుక్కోటానికి దొడ్లో అరుగు మీదకు పోగానే 'నాకు వెంకట్రామయ్యగారి అమ్మాయి నచ్చింది !' అన్నాడు తల్లితో.

'ఎవర్రా ? సరస్వతా' కమలమ్మ ముక్కు మీద వేలేసుకుంది.

'ఈమాట విన్నారా...' అంటూ కమలమ్మ కేకవేసింది!

'ఏమిటీ...?' మార్కండేయులు

అక్కడనుంచే కేక పెట్టుకుంటూ వచ్చాడు.

'వెంకట్రామయ్యగారమ్మాయిని చూసి రమ్మన్నారా వీడిని?' కమలమ్మ సూటిగా అగిడింది.

'నీ కేమన్నా మతుందా...ఆ అమ్మాయిని చూసిరావటమేమిటి...... మనకీ వాళ్లకీ పొత్తేమిటి...'

'మనవాడికి వాళ్ళమ్మాయి నచ్చిందట...' అంది కమలమ్మ.

మార్కండేయులు గజము లేక రెండున్నర మీటర్ల ఎత్తు ఎగిరాడు.

'వాళ్ళమ్మాయి నచ్చిందిటరా నీకు?.. ఆ అమ్మాయి ముక్కుబాగుంది...... అందుకని ఆ అమ్మాయి నచ్చింది అనటమేనా ? ముందూ వెనుక ఏమన్నా ఆలోచించుకునేది ఉందా...'

'వాడిని అలా హడల గొడతారేమండీ...'

'నువ్వు మధ్య కల్పించుకోక ... ఏమిరా? ఆ అమ్మాయి నచ్చిందీ నీకు...'

'అవును నాన్నా...'

'అసలు ఆ అమ్మాయిముఖం ఎవరు చూడమన్నారురా నిన్ను...'

'వాళ్ళింటికిపోతే కనపడింది...'

'అయ్...' ముందుకు ఉరికాడు

కమలమ్మ వారిద్దరిమధ్య ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శిలాగా వచ్చి నిలబడింది.

'ఎవరన్నా చూస్తే నవ్విపోతారు... మెల్లిగా మాట్లాడుకోవాలిగాని దెబ్బలాడుకుంటే ఏం ఉపయోగం...' అంది.

గోపాలం మెదలకుండా వెళ్ళిపోయాడు. మార్కండేయులు వెంకట్రామయ్య ఇంటికివెళ్ళి కప్పుఎగిరేలా అరిచి వచ్చాడు.

'ఆ అమ్మాయి జాతకం మంచిది కాదు...' అన్నాడు.

'మంచిదో కాదో మీకెట్లా తెలుసు ?' గోపాలం అడిగాడు.

'నాకు తెలియదురా...?' మార్కండేయులు ఎగిరాడు.

'నీకు తెలియదు...ఆ విషయం రుజువయింది.' గోపాలం మనోనేత్రం ముందు కూరగాయల మార్కెట్టులో పిల్లల్ని ఎత్తుకుని వచ్చిన అమ్మాయి కనపడింది.

కమలమ్మ పరిస్థితులు విషమించటం గమనించి తండ్రికి ఉత్తరం వ్రాసింది.

రామయ్య ఆ ఉత్తరం పట్టుకుని తిరుగుబండిలో వచ్చాడు. సంధి పత్రాలు దాఖలు కాలేదు.

'వెంకట్రామయ్య కూతుర్ని పెళ్ళి చేసుకోవలసివస్తే సన్యసించి దేశాలు పట్టి పోతాను' అన్నాడు మార్కండేయులు.

'వాడికి పెళ్ళయిన తర్వాత నేను మటుకు ఇక్కడ ఎందుకు ... నన్నుగూడా తీసుకుని పొండి ...' అంది కమలమ్మ.

రామయ్య ఇరుకులో పడ్డాడు.

గడియారం గిరగిరా తిరిగింది రామయ్య రాయబారాలు నడుస్తునే ఉన్నాయి. గోపాలం ఎక్కువ టైము వెంకట్రామయ్య ఇంటిదగ్గరే గడుపుతున్నాడు.

రామయ్య విసిగి, మార్కండేయుల్ని వప్పించలేకపోయాడు గోపాలానికి ఇష్ట మయినప్పుడు వెంటనే పెళ్ళి జరగాలని అంది కమల అందరికీ కోడళ్ళుంటే కొడుకుని కని, పెంచి, తను ఎందుకు వెలితిగా ఉండాలి? ఈ పెళ్ళి తనకూ ఇష్టమే...అంది.

రామయ్య తనే పీటలమీద కూర్చుని పెళ్ళి చేస్తానన్నాడు. లగ్నాలు నిశ్చయించాడు. శుభలేఖలు వ్రాయించాడు. అందరికీ పంపాడు. మార్కండేయులు చివరికి అప్రతిష్టపడేదాకా వచ్చేటప్పటికి ముఖం ముటముటలాడించుకుంటూ పీటల మీద కూర్చున్నాడు

పెళ్ళయింది.

'కోడలా...కోడలా......కొడుకు పెళ్ళామా...' అని ఇంతకాలానికి కదా పిలవగలిగింది అనుకుంది కమలమ్మ.

ఆ రాత్రి గోపాలం, సరస్వతిలకు వేరే గది కేటాయింపయింది. కమలమ్మ సావిట్లో పడుకుంది. ఏమిటో వెలితిగా ఉంది. గోపాలం ఎప్పుడూ తనదగ్గరే ఉండేవాడు...'ఎట్లా సంసారం దిద్దుకుంటాడో...ఏమిటో తెలివితక్కువ సన్నాసి...'అనుకుంది గదిలోనుంచి



హల్లో డార్లింగ్ రాత్రికి మా ఆవిడ పక్కింటి పిన్నిగారితో సినిమాకు పోతోంది తప్పకుండా వస్తావుగా నీ కోసం ఎదురు చూస్తూంటా"

గుప్పుమని పరిమళాలు వ్యాపిస్తున్నాయి. ఆమె మనసు తేలికగా, బరువుగా ఆ పరిమళాలపైన పయనిస్తోంది.

మడతమంచంవైపు తొంగి చూసింది. మార్కండేయులు అప్పుడే గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు

తెల్లవారింది. గడియారం గంటలమీద నమ్మకం లేక దానివంక చూసింది. అయిదయింది ఆరయింది. ఏడయింది గోపాలం గదిలోనుంచి బయటకు రాడు. సరస్వతి మెల్లగా పిల్లిలాగావచ్చి ఇంట్లోకి పోయింది. కమలమ్మ కోడలివంక అసూయగా చూసింది. సరస్వతి లోపలకు పోగానే 'గోపాలం...గోపాలం' అంటూ

బిగ్గరగా పిలిచింది. ఉలిక్కిపడి వచ్చాడు బయటకు

'ఎంత పొద్దెక్కిందిరా...' అంది గడియారం వైపు చూస్తూ. గోపాలం గడియారం వంక చూసి కిటికీలోనుంచి వస్తున్న సూర్యుణ్ణిచూసి కళ్లుచికిలించాడు

'ముఖం కడుక్కునిరా...' అంది కమలమ్మ

'సరస్వతి నీళ్ళు తెస్తుందిలే...' అన్నాడు గోపాలం కమలమ్మ నివ్వెర పోయింది అప్పుడే భార్యను పేరుపెట్టి తనముందు ప్రస్తావించేటంతవాడయ్యా డంటే నమ్మలేకపోయింది

'అదెందుకు ... నే తెస్తానుండు ...' అంటూ అట్లాగే కొయ్య బొమ్మలాగా నిలిచిపోయింది నీళ్ళు తెచ్చేటప్పటికి గదిలో గోపాలం గుర్రుపెట్టి నిద్రపోవటం కనిపించింది.

కమలమ్మకు పెట్టి వెలితిగా కనపడు తోంది గోపాలం తనతో కూర్చుని నాలుగు కబుర్లు చెప్పిన పాపాన పోలేదు ఎప్పుడు చూసినా ఆ గదిలోనే ఉంటాడు పగలూ, రాత్రీ ఒకటే గుసగుసలు. ఎప్పుడన్నా బయటకు వచ్చినా ఇద్దరూ కలిసే వస్తారు మళ్ళీ ఇద్దరూ కలిసే లోపలకు పోతారు, సరస్వతిని గురించి గోపాలాన్ని ఒంటరిగా అడుగుదా మనుకుంటే కుదరటమే లేదు

'అమ్మా సినిమాకు పోతున్నామే ఇవ్వాళ ' అన్నాడు గోపాలం మర్నాడు సాయంకాలం. గోపాలానికి సినిమాలంటే వేలంవెర్రి లేదు రెండు నెలలకో, మూడు నెలలకో ఒకసారి పోయివచ్చేవాడు. అదయినా తనతో వచ్చేవాడు మార్కెం దేయుటు వచ్చేవాడేకాదు. ఈ రోజు తనని పిలవలేదు పైగా వాళ్ళిద్దరూ కలిసి వెళతారట పెళ్ళయి రెండు రోజులు కాలేదు. కమలమ్మ కేదో అను మానం కలిగింది.

'ఏం సినిమా ?'

'ఏదన్నా సినిమాకు...ఆటపేరు చూడలేదు...'

'అంత తొందరేమొచ్చింది...'

'చూద్దామనుకున్నాంలే...' గోపాలం పొడి సమాధానం ఇచ్చాడు. కమలమ్మ అనుమానం నిర్ధారణ అయింది సరస్వతి పురమాయించి ఉంటుంది అనుకుంది. 'మీరిద్దరూ ఎందుకు ... నేనుగూడా వస్తాను...' అంది.

'నువ్వెందుకులేవే...' అన్నాడు గోపాలం.

'సరే పోయిరండి ...' అంది కమలమ్మ.

ఇద్దరూ రిక్షాలో ఎక్కి టాపు వేసు కుని వెళుతుంటే కమలమ్మ దిగాలుగా గుమ్మందగ్గర నిలబడింది

'సినిమా ఎట్లా ఉంది ...?' అంది వాళ్లు ఇంటికి రాగానే.

'బాగానే ఉంది ...' అన్నాడు గోపాలం వంటింట్లోఉన్న సరస్వతి వంక

చూస్తూ. ఏమిటో సంజ్ఞ చేస్తున్నాడు. కమలమ్మ గ్రహించి వెనక్కి తిరిగింది. సరస్వతి చేతితో పిలుస్తోంది.

'అన్నం పెడతాను పద...' అంది కమలమ్మ.

'ఎందుకు సరస్వతి పెడుతుందిలే... నువ్వు పడుకో...' అన్నాడు. కమలమ్మ పోయి మంచానికొరుగుకుని పడుకుని నిద్రపోయింది.

గోపాలం, సరస్వతి షికార్లు ఎక్కువయినాయి. ఒక వేళలేదు పాళలేదు, పగలులేదు రాత్రిలేదు మార్కండేయులుకిగూడా చికాకుగానే ఉంది 'చిన్నవాళ్ళు తిరుగుతున్నారులే...' అని ఊరుకున్నాడు. ఒకసారి మొండికేసి తనూ వస్తానని కమలమ్మ బయలుదేరిన నాడు వాళ్ళిద్దరూ ఒక రిక్షాలో కూర్చున్నారు. తను ఒక్కతే బిక్కు బిక్కుమంటూ కూర్చుంది. ఇంటికి వచ్చిన తర్వాత మార్కండేయులు దగ్గర ఏమిటో చెప్పింది వీళ్ళమీద.

ఒకరోజు గోపాలాన్ని మెల్లిగా పిలిచి 'ఆడవాళ్ళ మాటలు వినగూడదురా నాయనా...' అని చెప్పింది.

'నువ్వు వద్దంటేమటుకు నీ మాట వినకుండా ఉంటానా అమ్మా...'అన్నాడు.

ఇంకోరోజు 'నువ్వు పెళ్లాన్ని వెంటేసుకుని తిరగటం ఏమీ బాగా లేదురా...అంతా ఏమనుకుంటారు...' అంది.



"ఆ రెండుజడలామె తీసుకున్న చోటకే నాకూ ఇవ్వండి."

'నా పెళ్ళామేగదా అమ్మా......' అన్నాడు గోపాలం.

కమలమ్మ తెల్లబోయి ఊరుకుంది.

'వాడికి లేకపోతే...నీకన్నా ఉండాలి...రాత్రిళ్ళు ఆ పకపకలేమిటి... ఎవరన్నా వింటే ఎంత అప్రతిష్ట...?' అంది సరస్వతిని పిలిచి.

'వారు...' సరస్వతి ఏదో చెప్పబోయింది.

'వారులేదు నవారులేదు...కొంచెం జాగ్రత్తగా ఉండు...ఎటువచ్చినా ఆడదాన్నే అంటారు...ఎంత జాగ్రత్తగా ఉండాలి...దేనికయినా ఒక హద్దంటూ ఉండాలి...ఆ షికార్లు తగ్గించుకోవాలి..'

'అట్లాగేనండి...'

'తల తిప్పగానే సరికాదు...మొగుడు చెప్పాడు గదా అని అన్నీ మాటలు వినక్కర్లేదు...వాడసలే తెలివితక్కువ వాడు...జాగ్రత్తగా దిద్దుకురావాలి... ఈమధ్య చూస్తున్నాగా డబ్బు గూడా దుబారా చేస్తున్నాడు. రూపాయి ఖర్చు పెటతానన్నచోట పావలా ఖర్చు పెట్టించాలి...ఎంత పొదుపరిగా ఉండాలి ?'

'అట్లాగేనండి...'

'తెలిసిందా సరస్వతీ......వాడు అన్నాడుగదా అని అన్ని మాటలు వినక్కర్లేదు...'

సరస్వతి తల ఊపుతునే ఉంది.

గోపాలం వచ్చాడు తర్వాత.

'మీ మాటలు వినొద్దని అత్తగారు చెప్పారు...' అంది సరస్వతి.

'నీ మాటలు వినొద్దని నాతో చెప్పింది...' అన్నాడు గోపాలం.

'మరి మనిద్దరం ఒకళ్ళమాట ఒకళ్ళం వినకపోతే సాగె దెట్లాగు...'

'అదే నాకూ అర్థం కావటంలా...'

గదిలోనుంచి ఫక్కుమని నవ్వు కిటికీ లోంచి వచ్చి కమలమ్మ చెవుల్లో దూరింది, చురచుర చూసింది.

'ఇట్లారా...' మార్కండేయులు పిలిచాడు దొడ్డిగుమ్మంలో నిలబడి.

కమలమ్మ మెల్లిగా వెళ్ళింది.

'నిజమేనా...?'

'ఏమిటి మీ రడిగేది ?'

'ఇంత వయసు వచ్చినా బుద్ధిరాలేదు నీకు...!

ఇప్పు డనుకుని ఏం లాభం...సంగతేమిటో చెప్పండి...'

'మన కోడలు సంగతి...'మార్కండేయులు సాలోచనగా చూశాడు. కమలమ్మ గ్రహించింది.

'సరే...దాని సంగతా...అవును నెల తప్పింది...నిజమే...'అంది.

మార్కండేయులు పంచాంగం చుట్ట చుట్టి చంకనపెట్టి వీధిలోకి వెళ్ళి నక్షత్రాల వంక చూస్తూ కూర్చున్నాడు. తిధి చూశాడు. పంచమి. పెళ్ళయి నెలగూడా కాలేదు లగ్నం వేళ గుర్తుకు వచ్చింది. 'దైవేచ్ఛ..'అనుకుంటూ కూర్చున్నాడు.

పెళ్ళయిన మూడోనెలకల్లా సరస్వతి పండంటి మగపిల్లవాడిని కన్నది. అంతా తెల్లపోయారు. కొంతమంది అదిరి పోయారు. కమలమ్మ గుండెలు బాదుకుంది. మార్కండేయులు అసలే తాచుపాములాంటి వాడు. తోక తొక్కినట్లయింది సరస్వతి తండ్రి వెంకట్రామయ్య దగ్గరకు పోయాడు. అప్పుడే పురిటి సంగతి అందరికీ తెలిసింది.

'ఇటువంటి దుర్మార్గం చేస్తారని తెలియదు...' అన్నాడు మార్కండేయులు వెంకట్రామయ్యతో.

'అందుకనే అంత కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు...' అన్నాడు పక్కనే ఉన్న పుల్లయ్య.

వెంకట్రామయ్య కుర్చీలోనుంచి శాంతంగాలేచి 'మీరంతా వళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడండి...' అన్నాడు.

మార్కండేయులు ధూం ధాం లాడు తున్నాడు. 'మీ అబ్బాయినే అడగండి... అన్నీ చెపుతాడు...' అన్నాడు వెంకట రామయ్య ఆఖరికి.

'వాడిని అడిగేదేమిటి...తెలివి తక్కువ సన్నాసి ... వాడిగొంతు కోశారు...'అంది కమలమ్మ కళ్ళంబడి నీళ్ళు పెట్టుకుంటూ.

'ముందు ఇక్కడనుంచి బయటకు పొండి...మీకు బుద్ధిలేదు...' అన్నాడు వెంకటరామయ్య. అంత పెద్దమాట విన్న తర్వాత మార్కండేయులుకి కోపం ఆగలేదు...

'మాకే బుద్ధి ఉంటే...ఈ అధోగతి సంబంధానికి వప్పుకునేవాళ్ళమా ...?' అని శాపనార్ధాలు పెడుతూ ఇంటికి వచ్చారు.

గోపాలం పురిటిగదిలో కుర్చీ పీటమీద కూర్చుని సరస్వతితో కబుర్లు చెబుతూ పసికందువైపు ప్రేమగా చూస్తున్నాడు.

'ఒరేయి గోపాలం ... ఇట్లా బయటకు రారా సన్నాసీ...ఇంకా ఆ గదిలో ఏం అఘోరిస్తావు?...' మార్కండేయుల అరుపు విని గోపాలం తాపీగా బయటకు వచ్చాడు.

'ఇదంతా ఏమిటిరా...' పుస్తెకట్టి మూణ్నెల్లు కాలేదు??'

'మరి నేను అడిగినప్పుడు పెళ్ళెందుకు చెయ్యలేదు...?' అంటూ ఎదురు ప్రశ్న వేశాడు గోపాలం.

మార్కండేయులు గోపాలంకళ్ళల్లోకి చూశాడు. సన్నగా నవ్వుతున్నాయి. చిలిపితనం కనపడుతోంది.

మార్కండేయులు గ్రహించినట్లు ముఖంపెట్టి గోపాలం దగ్గరకువచ్చి వీపుమీద తట్టి 'అట్లాగయితే సరేలే...' అన్నాడు.

గోపాలం తల వంచుకున్నాడు కమలమ్మ గర్వంగా ఇంట్లోకి నడిచింది

గడియారం మూడుగంటలు కొట్టింది. గోపాలం దానివంక చూశాడు, నాలుగు గంట లయింది.

'నేను ఇవ్వాళ గుర్తుపెట్టుకుని రిపేరు చేయిస్తాలే నాన్నా...'అన్నాడు.

గదిలోపల పిల్లవాడు ఏడుస్తున్నాడు.

'సుపుత్రుడు పిలుస్తున్నట్లున్నాడు... పోయి పలకరించు గడియారం సంగతి నేను చూస్తాలే...' అన్నాడు మార్కండేయులు. వంటింటిలోనుంచి కమలమ్మ ముసిముసి నవ్వు స్పష్టంగా కనిపిస్తోంది.